## క్లుప్తంగా

### ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం

రేగిడి: మండలంలోని జాడపేట గ్రామంలో కొత్తగా నిర్మించిన అవతారిణి అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు రామాయణం సత్యనారాయణశర్మ, జయరాంశర్మల ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన అనేక మంది భక్తులు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

### 23 మంది వలంటీర్ల రాజీనామా



వంగర: రాజీనామా పత్రాలను ఎంపీడీవోకు అందజేస్తున్న శ్రీహరిపురం వలంటీర్లు

వంగర: మండలంలోని కొండచాకరాపల్లి, మగ్గూరు, శ్రీహరిపురం గ్రామాలకు చెందిన 23 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఎంపీడీవో ఎస్.సాల్మాన్‌రాజ్‌కు తమ రాజీనామా పత్రాలను శుక్రవారం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చెంతకు చేరవేసే భాగ్యం తమకు దక్కిందని, తమపై టీడీపీ నేతలు పనిగట్టుకుని విమర్శలు చేయడం ఎంత మాత్రం తగదన్నారు. తామంతా స్వచ్ఛందంగా రాజీనామా చేశామన్నారు.

### ఆర్థికసాయం

బొబ్బిలి: విధి నిర్వహణలో అకస్మాత్తుగా ప్రాణాలు విడిచిన హోంగార్డు కెంగువ మహేష్ కుటుంబానికి ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ, సిబ్బంది కలిసి ఆర్థికసాయం చేశారు. వారంతా పట్టణంలోని బాధిత కుటుంబ సభ్యుల ఇంటి వద్దకు శుక్రవారం వెళ్లి, రూ.46 వేల నగదును వారికి అందజేశారు.

### ముమ్మరంగా వాహన తనిఖీలు



వంగర: కారు డిక్కీలో తనిఖీలు చేస్తున్న ఎస్ఐ జనార్దన్

వంగర: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. మండలంలోని మద్దువలస జంక్షన్ వద్ద ఎస్ఐ వై.వి.జనార్దన్ శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టి, వాహనదారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల నిబంధనల మేరకే మద్యం, డబ్బు తరలించాల్సి ఉంటుందని, పరిమితికి మించి వాటిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతిఒక్కరూ ఎన్నికల నియమాలు పాటించాలన్నారు.

### రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజాం సిటీ: స్థానిక పాతబొబ్బిలి రోడ్డులోని గోపాలపురం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఏఈ ఓజేసీపీ కుమార్ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లో చేయనున్న మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

### ఉపాధి పనుల పరిశీలన



రేగిడి: సంకిలి వద్ద వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీవో హరనాథరావు

రేగిడి: మండలంలోని సంకిలి, చిన్నయ్యపేట, బొడ్డవలస తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీవో ఎస్.హరనాథరావు శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన వేతనదారులతో మాట్లాడుతూ కొలతల ప్రకారం పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందన్నారు. పనిలోకి వచ్చిన వారికి మాత్రమే మస్తరు వేయాలని, తప్పుడు మస్తర్లు వేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

రాజాం: మండలంలోని పొగిరి గ్రామ చెరువు వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. కనీస వేతనం రూ.300 వచ్చేలా కొలతల ప్రకారం పనిచేయాలని, వేసవి ఎండల నేపథ్యంలో తాగునీరు, మెడికల్ కిట్, టెంట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

### వడదెబ్బపై అప్రమత్తం

బొండపల్లి: వడదెబ్బ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ ఎస్.హరిహరరావు సూచించారు. మండలంలోని జె.గుమడాం గ్రామంలో శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గ్రామస్తులకు వివరించారు. ఉదయం 10 గంటల తరువాత ఇంటి నుంచి బయటకు రావాల్సి వస్తే వెంట గొడుగు, వాటర్ బాటిల్ తీసుకుని వెళ్లాలని సూచించారు.

# ఆశీర్వదించండి.. మరింత అభివృద్ధి, సంక్షేమం చేసి చూపిస్తాం

- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్



సంతకవిటి: సంతకవిటిలో ఎన్నికల ప్రచారంలో రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ తదితరులు

సంతకవిటి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తనను, వైఎస్సార్ సీపీని ఆశీర్వదించి అధికారంలోకి తీసుకువస్తే మరింత అభివృద్ధి, సంక్షేమం చేసి చూపిస్తామని వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల కేంద్రంతో పాటు మండలంలోని చిన్నయ్యపేట, కాకరాపల్లి, అక్కరాపల్లి, మందరాడ గ్రామాల్లో శుక్రవారం పర్యటించిన ఆయనకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తపన అని, ఆ దిశగా ఆయన పాలన కొనసాగించారన్నారు. ప్రతీ ప్రాంతంలో కొత్తగా అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు ప్రతీ గ్రామంలోని ప్రతీ ఇంటికి లబ్ధి చేకూరేలా సంక్షేమ పథకాలు రూపొందించి, అమలు చేశారన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. వైఎస్సార్ సీపీతోనే అన్నివర్గాలకు మేలు అని, వచ్చే ఎన్నికల్లోనూ మళ్లీ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి, ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను, ఎంపీగా మరోసారి పోటీ చేస్తున్న బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించి, జగనన్నకు కానుకగా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు, కళింగ కార్పొరేషన్ చైర్మన్ జి.స్వామినాయుడు, మాజీ వైస్ ఎంపీపీ గండ్రేటి కేసరి, జేసీఎస్ కన్వీనర్ ఆర్.రమేష్‌నాయుడు, ఎంపీటీసీ పి.శంఖరరావు, కాకరాపల్లి సర్పంచ్ వావిలపల్లి రమణ, మందరాడ సర్పంచ్ వావిలపల్లి సాయిలత, ఎంపీటీసీ శ్రీనివాస నాయుడు, తాలాడ ఎంపీటీసీ సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.



రాజాం: మండల కేంద్రంలోని రాణావీధిలో ఎన్నికల ప్రచారంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసరావు

**ఫ్యాన్ గుర్తుకే ఓటేయండి..**

రాజాం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి, మరోసారి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావాలని పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య అన్నారు. స్థానిక పట్టణ పరిధిలోని మాధవబజార్, కిరాణా మార్కెట్, గాంధీనగర్, రాణావీధి ప్రాంతాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించిన వారు ఇంటింటికీ వెళ్లి, ఈ ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం వివరించారు. అలాగే గతంలో అధికారంలో ఉన్న సమయంలో టీడీపీ ప్రజలను మోసగించిన తీరును తెలిపారు. ఎన్నికల వేళ మాయ మాటలు చెప్పి, మళ్లీ ప్రజలను మోసగించాలని చూస్తున్న టీడీపీ కూటమి నేతలను నమ్మవద్దని, మనమంతా బాగుండాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీకే ఓటు వేయాలని తెలిపారు. రాజాం ఎమ్మెల్యేగా డాక్టర్ తలే రాజేష్‌ను ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ పాలవలస గోపి, పార్టీ నాయకులు దూబ గోపాలం, శాసపు వేణుగోపాలనాయుడు, ముగడ రవి, పాలవలస శ్యామ్, వివేకానందరావు, తోట తిరుమలరావు, కోల్లా రమ్య తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో జెడ్పీటీసీ సరస్వతి, పార్టీ మండల అధ్యక్షుడు లక్షుంనాయుడు

రామభద్రపురం: మండలంలోని కొట్టక్కి గ్రామానికి చెందిన 30 కుటుంబాల వారు శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికీ జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి, పార్టీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్షుంనాయుడులు పార్టీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఇనుపచుప్పల జ్ఞానప్రకాష్, బొత్స దుర్గారావు, సింగారపు సతీష్, గొంప హేమంత్, గొంప సురేష్, లోపింటి స్వరూప, సోంబారికి కిరణ్ తదితరులు ఉన్నారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ తామంతా టీడీపీలో చేరినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరిగిందని, అదంతా అవాస్తమని, తామంతా వైఎస్సార్ సీపీలో చేరినట్లు తెలిపారు. సీఎం జగనన్న చేస్తున్న సంక్షేమ పాలన నచ్చే తామంతా వైఎస్సార్ సీపీలో చేరామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అప్పికొండ అనురాధ, వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు అప్పికొండ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

### మెనూ తప్పనిసరిగా పాటించాలి

రేగిడి: జగనన్న గోరుముద్ద పథకం కింద ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం అమలులో మెనూ తప్పనిసరిగా పాటించాలని ఎంఈవో ఎం.వి.ప్రసాదరావు సూచించారు. మండలంలోని వండానపేట, చాటాయవలస, ఉప్పరనాయుడువలస తదితర గ్రామ పాఠశాలలను శుక్రవారం సందర్శించిన ఆయన విద్యార్థుల కోసం సిద్ధం చేసిన భోజనం వంటకాలను పరిశీలించారు. పదార్థాలు వేడివేడిగా ఉన్నప్పుడే వడ్డించాలని, అలాగే పదార్థాలు రుచి, శుచి కలిగి ఉండాలని, పిల్లలు తాగేందుకు కాచి, చల్లార్చిన నీటిని అందుబాటులో ఉంచాలని తెలిపారు. అనంతరం తరగతుల వారీగా విద్యార్థుల వద్దకు వెళ్లి, వివిధ ప్రశ్నల ద్వారా వారి విద్యాసామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని, ఉపాధ్యాయులు తప్పనిసరిగా లెస్సన్ ప్లాన్ రూపొందించుకుని, దాని ఆధారంగా పాఠ్యాంశ బోధన చేయాలన్నారు.



వండానపేట పాఠశాలలో విద్యార్థులకు వడ్డించిన భోజనం పరిశీలిస్తున్న ఎంఈవో ప్రసాదరావు

### మద్యంసీసాలు స్వాధీనం

సంతకవిటి: మండలంలోని రామారాయపురం జంక్షన్ వద్ద పోలీసులు శుక్రవారం జరిపిన తనిఖీల్లో 20 మద్యంసీసాలు పట్టుబడినట్లు హెడ్ కానిస్టేబుల్ ఎస్.దుర్గాప్రసాదరావు తెలిపారు. సిరిపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నుంచి 10 మద్యంబాటిళ్లు, పోతురాజుపేట గ్రామానికి చెందిన వ్యక్తి నుంచి మరో 10 మద్యంబాటిళ్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు.

వంగర: మండలంలోని మద్దువలస వద్ద అక్రమంగా మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని శుక్రవారం పట్టుకుని, అరెస్ట్ చేశామని ఎస్ఐ వై.వి.జనార్దన్ తెలిపారు. ఆ వ్యక్తి నుంచి 10 మద్యంసీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

# సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ నేతలు



రాజాం సిటీ: పరశురాంపేటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ రాజగోపాలనాయుడు తదితరులు

రాజాం సిటీ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమని వైఎస్సార్ సీపీ రాజాం రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు అన్నారు. మండలంలోని గురవాం, పరశురాంపేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించిన వారు ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లోనూ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి, మళ్లీ వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావాలని అలాగే రాజాం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ తలే రాజేష్‌ను, ఎంపీ అభ్యర్థిగా మరోసారి బరిలో ఉన్న బెల్లాన చంద్రశేఖర్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముళ్ల చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వంగర: మండలంలోని శ్రీహరిపురం గ్రామంలో వైఎస్సార్ సీపీ నేతలంతా శుక్రవారం ఎన్నికల ప్రచారం చేపట్టి, ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. రాష్ట్రం బాగుండాలంటే సీఎం జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, ఆయనను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు మనమంతా సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, పార్టీ నాయకులు గార సిమ్మినాయుడు, తెంటు జోగినాయుడు, కె.రామారావు మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, మళ్లీ వైఎస్సార్ సీపీని గెలిపించాలని పార్టీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు, జేసీఎస్ కన్వీనర్ కింజరాపు సురేష్ కోరారు. మండలంలోని కె.వెంకటాపురం, గదబపేట గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించిన వారు.. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కరణం గోవిందరావు, కెంబూరి వెంకటేశ్వరరావు, కరణం శ్రీనివాసరావు, పాడి లక్షుంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



వంగర: ఇంటింటికీ వెళ్లి, ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు



రేగిడి: కె.వెంకటాపురంలో వైఎస్సార్ సీపీ నేతల ఎన్నికల ప్రచారం

# ఫ్యాన్ గుర్తుకు ఓటేసి, గెలిపించండి



ఎన్నికల ప్రచారంలో ఇంటింటికీ వెళ్తున్న ఎమ్మెల్యే శంబంగికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

తెర్లాం: రానున్న ఎన్నికల్లోనూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి, వైఎస్సార్ సీపీని మళ్లీ గెలిపించాలని, అలాగే మరోసారి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను, ఎంపీగా పోటీ చేస్తున్న బెల్లాన చంద్రశేఖర్‌ను కూడా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కోరారు. మండలంలోని నెమలాం, ఉద్దవోలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. రాష్ట్రంలో మళ్లీ సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, పేదల బతుకులు మారాలన్నా ముఖ్యమంత్రిగా మళ్లీ సీఎం జగనన్నే ఉండాలన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయనన్ని సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత ఆయనదేనన్నారు. గత టీడీపీ పాలనలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు చేసింది ఏమీలేదన్నారు. సీఎం జగన్ తన ఐదేళ్ల పాలనలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి, పాలన కొనసాగించారన్నారు. మీ కుటుంబంలో మంచి జరిగితేనే ఓటు వేయాలని కోరిన దమ్మున్న నాయకుడు సీఎం జగన్ అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి నర్సుపల్లి బాబ్జీరావు, జెడ్పీటీసీ ప్రతినిధి గర్భాపు రామారావు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తెంటు సత్యం నాయుడు, డీసీసీబీ డైరెక్టర్ బోను అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: పట్టణ పరిధిలోని గొల్లపల్లి 11, 12వ వార్డుల్లో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు శుక్రవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు ఆయా వార్డుల ప్రజలు సాదరస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీనే మళ్లీ అధికారంలోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఎమ్మెల్యే అన్నారు. తన హయాంలో నియోజకవర్గంలో ఎంత అభివృద్ధి జరిగిందో మీ అందరికీ తెలుసన్నారు. ఇక్కడి బొబ్బిలి రాజుల పోటీ వారి అధికార దాహం తీర్చుకోవడం కోసమే తప్ప ప్రజలకు మేలు చేసేందుకు కాదన్న విషయం గుర్తించాలన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమం, అభివృద్ధి అందిస్తున్న వైఎస్సార్ సీపీనే మళ్లీ గెలిపించాలని కోరారు. అంతకుముందు బైపాస్ రోడ్డులోని దాడితల్లి ఆలయంలో ఎమ్మెల్యే శంబంగి, జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్ శంబంగి వేణుగోపాలనాయుడు, జేసీఎస్ జిల్లా కన్వీనర్ శంబంగి శ్రీకాంత్‌లు పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, పట్టణ జేసీఎస్ ఇన్‌చార్జ్ రేజేటి ఈశ్వరరావు(విసు), పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు, మున్సిపల్ వైస్ చైర్మన్లు చెలికాని మురళీకృష్ణ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడుకు మద్దతుగా ఆయన సతీమణి శంబంగి చిన్నమ్మలు, ఎంపీపీ శంబంగి లక్ష్మి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తూముల అచ్యుతవల్లిలు కలిసి స్థానిక పట్టణంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పాతబొబ్బిలిలోని సరేపోలమ్మను దర్శించుకుని, ఆ తర్వాత అమ్మవారి ఘటాలు నెత్తిన పెట్టుకుని మరీ ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి, రానున్న ఎన్నికల్లోనూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి, వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్‌పర్సన్ తెంటు పార్వతి, కౌన్సిలర్లు దిబ్బ సునీత, బొత్స రమణమ్మ, ఒమ్మి మహాలక్ష్మి, వనజకుమారి, బంగారు రాణి, ఎస్.వాసంతి తదితరులు పాల్గొన్నారు.

# భారీగా నగదు పట్టివేత

రామభద్రపురం: మండలంలోని మిర్తివలస జంక్షన్ వద్ద గురువారం రాత్రి చేపట్టిన వాహన తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న రూ.89,530 నగదు పట్టుకుని, సీజ్ చేసినట్లు ఎస్ఐ జ్ఞానప్రసాద్ శుక్రవారం తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ దీపికా పాటిల్ ఆదేశాల మేరకు వాహనాలు తనిఖీలు చేస్తుండగా ఒడిశా నుంచి రామభద్రపురం వైపు వస్తున్న ఓ కారులో ఎటువంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న డబ్బులు పట్టుకున్నామని, తదుపరి చర్యలకు జెడ్పీ సీఈవోకు పంపించామన్నారు.

రాజాం సిటీ: మండలంలోని పొగిరి గ్రామం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు శుక్రవారం జరిపిన వాహన తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న రూ.5,23,300 పట్టుబడింది. పొందూరు వైపు నుంచి వస్తున్న కారును, ఆపి సోదాలు చేయగా, ఈ నగదు లభ్యమైందని సీఐ డి.మోహనరావు తెలిపారు. సంబంధిత నగదుకు సంబంధించి, సరైనా ఆధారాలు చూపించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం రూ.50 వేలకు మించి నగదు తీసుకువెళ్లకూడదన్నారు.

బొబ్బిలి: పాతబొబ్బిలి చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం చేపట్టిన వాహన తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న రూ.5,59,500 నగదును పట్టుకుని, స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జి.లోవరాజు తెలిపారు. తదుపరి చర్యల కోసం జెడ్పీ సీఈవోకు ఈ నగదును పంపించామన్నారు.

# ఉపకరణాల పంపిణీకి నిర్ధారణ పరీక్షలు

రాజాం సిటీ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో దివ్యాంగుల ఉపకరణాల పంపిణీకి సంబంధించి, లోప నిర్ధారణ పరీక్షలు శుక్రవారం నిర్వహించారు. రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాలకు చెందిన దివ్యాంగులు హాజరు కాగా, వీరిలో వినికిడికి సంబంధించిన పరికరాల కోసం 41 మంది, వీల్‌చైర్స్‌కు సంబంధించి 37 మంది, రోలేటర్స్‌కు 22 మంది, ట్రైసైకిళ్లకు 11 మంది, ఎంఆర్ కిట్స్‌కు 8 మంది ఎంపికయ్యారన్నారు. అర్హులందరికీ త్వరలోనే ఉపకరణాలు, పరికరాలు అందజేస్తామని ఎంఈవో వై.దుర్గారావు తెలిపారు.

కార్యక్రమంలో సహిత విద్య జిల్లా సమన్వయకర్త ఎస్.సూర్యారావు, ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు, ఎంఈవో బి.శాంతకుమారి, వైద్యాధికారులు రాజశేఖర్, నేతాజీ తదితరులు పాల్గొన్నారు.

# మండల సర్వసభ్య సమావేశం



విద్యాశాఖ ప్రగతి నివేదికను చదివి, వినిపిస్తున్న ఎంఈవో రాజేశ్వరి

బాడంగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు సభ్యులు తమ పరిధిలోని పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించాలని కోరారు. అధికారులు కూడా తమ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి నివేదికలను చదివి, వినిపించారు. ప్రతీ మూడు నెలలకోసారి జరిగే మండల సమావేశాల్లో సభ్యులు అడుగుతున్న ప్రశ్నలకు అధికారులు జవాబుదారీతనం వహించి, సరైన సమాధానాలు ఇవ్వాలని ఎంపీపీ భోగి గౌరి, జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు సూచించారు. సమావేశంలో పీఆర్ జేఈ రమేష్, ఈవోపీఆర్డీ సూర్యనారాయణ, ఎంపీడీవో అంజనేయులు, ఎంఈవో రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సత్తా



రాజాం: కె.తేజేశ్వరి, 464(ఎంపీసీ), ఆదిత్య కళాశాల, రాజాం



రాజాం: జ్యోత్స్న, 985(ఎంపీసీ), ఆదిత్య కళాశాల, రాజాం



బొబ్బిలి: సి.హెచ్.పావని, 989(ఎంపీసీ), వాసు కళాశాల, బొబ్బిలి



బొబ్బిలి: వి.వరుణ్‌కుమార్, 986(ఎంపీసీ), వాసు కళాశాల, బొబ్బిలి



బొబ్బిలి: ఆర్.భార్గవి, 985(ఎంపీసీ), వాసు కళాశాల, బొబ్బిలి



బొబ్బిలి: ఎం.సరిత, 985(ఎంపీసీ), వాసు కళాశాల, బొబ్బిలి



బొబ్బిలి: వి.వినయ్‌కుమార్, 985(ఎంపీసీ), వాసు కళాశాల, బొబ్బిలి

ఇంటర్మీడియట్ ఫలితాల్లో పలువురు విద్యార్థులు సత్తా చాటారు. శుక్రవారం విడుదలైన పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ మార్కులతో తమలోని ప్రతిభను కనబరచగా, మంచి మార్కులు సాధించిన విద్యార్థులను సిబ్బంది, తల్లిదండ్రులు అభినందించారు. ఇదే స్ఫూర్తితో ఉన్నత చదువులు కూడా బాగా చదవాలని ఆకాంక్షించారు. – సాక్షి నెట్‌వర్క్.